క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

విజయపురం: మండలం కేంద్రంలో శనివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

శ్రీరంగరాజపురం: 2047 నాటికి వికసిత భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. శుక్రవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ, ప్రజాప్రతినిధులకు, మండల స్థాయి అధికారులకు వికసిత భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ అభివృద్ధికి డాక్యుమెంట్ రూపకల్పనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజాప్రతినిధులతో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డీటీ లోకనాథపిళ్లై, ఏఓ కృష్ణయ్య, ఈఓపీఆర్‌డీ పురుషోత్తం పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించండి


గుంతలమయంగా చవరంబాకం రోడ్డు

నింద్ర: మండలంలోని చవరంబాకం గ్రామంలో వర్షం పడితే రోడ్డు బురదగా మారుతోంది. దీంతో గ్రామానికి వెళ్లడానికి ద్విచక్ర వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు గుంతలుగా మారడంతో మహిళలు, పిల్లలు రోడ్డుపై నడిచి వెళ్లలేక పోతున్నారు. ఈ విషయంపై పలుసార్లు మండల అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఇబ్బంది పడుతున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నింద్ర విద్యార్థిని


యామిని

నింద్ర: మండలంలోని జిల్లా ఉన్నత పాఠశాల చెందిన యామిని రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జ్ఞానకుమార్ తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదివే విద్యార్థి జిల్లా స్థాయిలో జరిగిన 200, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరచిన యామిని రాష్ట్రస్థాయికి ఎంపికైంది. శ్రీకాకుళంలో అక్టోబర్ 9న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుంది.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి


పెద్దబ్బ

వెదురుకుప్పం: పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మనీడొడ్ల గ్రామానికి చెందిన కొత్తపల్లె పెద్దబ్బ అలియాస్ గోవిందయ్య గురువారం రాత్రి కన్ను మూశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తగా పార్టీ కోసం పనిచేసే వాడని తెలిపారు. ఆయన మృతికి పలువురు నివాళులర్పించారు.

రాస్ వృద్ధాశ్రమంలో అన్నదానం


వృద్ధులకు భోజనం అందిస్తున్న దాతలు

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం అన్నదానం చేపట్టారు. మండల పరిధిలోని కత్తెరపల్లి గ్రామానికి చెందిన బాబురెడ్డి, ప్రమీల దంపతుల మనవడు సుహర్షిత్‌రెడ్డి మొదటి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం కేక్ కట్ చేశారు. అనంతరం మధ్యాహ్నం వృద్ధులకు పళ్లు, స్వీట్లతోపాటు అన్నదానం చేపట్టారు. రాస్ కో-ఆర్డినేటర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న నేతలు

నగరి: మున్సిపల్ పరిధి 17వ వార్డులో బీఎస్పీ నేత పిచ్చయ్య మృతి చెందగా ఆయనకు జై భీమ్ సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పవర్ రామచంద్రన్, బీఎస్పీ నాయకుడు దేశయ్య నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. జిల్లా బీఎస్పీ ప్రధాన కార్యదర్శి నాగూరు, జై భీమ్ సేన జిల్లా అధ్యక్షుడు దూళి బాబు, సభ్యులు ముదిరాజ్, ముత్తు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి అంగన్‌వాడీ పోస్టులు

జీడీ నెల్లూరు నియోజకవర్గంలో అంగన్‌వాడీ పోస్టులను అమ్మకానికి పెడుతున్నారు. ఉన్నత విద్యార్హతలు కలిగి ఉన్న వివాహిత మహిళలు ఎంతో ఆశతో తమ పరిధిలోని అంగన్‌వాడీ ఉద్యోగాలను దక్కించుకోవాలని దరఖాస్తు చేసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వంలోని కొందరు చోటా నాయకులు అంగన్‌వాడీ పోస్టులను అంగట్లో అమ్మకానికి పెట్టి వేలం పాట తరహాలో ఎక్కువ ధర చెల్లించిన వారికి కట్టబెట్టేందుకు రంగంలోకి దిగారు. తమ హవాను చాటుకుంటూ దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులను తమ చుట్టు ప్రదక్షిణలు చేయించుకుంటున్నారు.

– కార్వేటినగరం

- రూ.3 నుంచి 7 లక్షలు డిమాండ్
- నిరాశకు గురవుతున్న అర్హులైన అభ్యర్థులు
- టీడీపీ నాయకుల మాటే శాసనం


గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

అమ్మకానికి అంగన్‌వాడీ పోస్టులు

నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెనుమూరు, పాలసముద్రం, గంగాధరనెల్లూరు మండలాలు ఉన్నాయి. కార్వేటినగరం ప్రాజెక్టు పరిధిలో శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలు ఉంటున్నాయి. జీడీనెల్లూరు ప్రాజెక్టు కింద ఉన్న ఉద్యోగ ఖాళీల్లో అంగన్‌వాడీ మెయిన్-1, మినీ అంగన్‌వాడీ-2, 10 హెల్పర్ పోస్టులకు, కార్వేటినగరం ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ-3, మినీ-2, హెల్పర్లు 6 ఖాళీగా ఉన్నాయి. ఈ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఈ నెల 11వ తేదీ ఐసీడీఎస్ ప్రాజెక్టు చిత్తూరు వారు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే ఆయా గ్రామాల్లో ఉన్న పోస్టులకు పేదరికంతో అల్లాడుతూ జీవనోపాధి కోసం ఎదురు చూస్తున్న పలువురు అర్హులైన మహిళా అభ్యర్థులు అనేక మంది ఎన్నో ఆశలతో దరఖాస్తు చేసుకున్నారు. ఆ ఉద్యోగాలకు శుక్రవారం చిత్తూరు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువ పత్రాలతో ఎంతో ఆశగా హాజరైనా ఇంటికి చేరుకునేలోపు వారికి నిరాశే మిగిలినట్లు సమాచారం.

ఉద్యోగాల వేలంపాట

అంగన్‌వాడీ ఉద్యోగాలకు అర్హత అనేది లేకుండా కూటమి నాయకులు అంగట్లో ఆట వస్తువులా వేలం పాట పాడుతున్నారు. అంగన్‌వాడీ హెల్పర్, మినీ అంగన్‌వాడీ పోస్టులకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ధర నిర్ణయించినట్లు సమాచారం. అదే అంగన్‌వాడీ మెయిన్ సిబ్బంది ఉద్యోగాలకు రూ.6 లక్షల నుంచి 7 లక్షల వరకు ధర నిర్ణయించి దండుకునేందుకు సిద్ధమైనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ వీఎం థామస్ పారదర్శకమైన పాలన అందించి అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అంతా కోరుతున్నారు. ముడుపులు తీసుకుంటూ విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు సైతం తన నియోజకవర్గంలో అవసరం లేదని ఆయన హెచ్చరించారు. అయితే కూటమి ప్రభుత్వంలో గ్రామస్థాయి చోటా నాయకులు ఎమ్మెల్యే మాటలను పెడచెవిన పెట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

టీడీపీ నాయకుల మాటే శాసనం

అంగన్‌వాడీ ఉద్యోగాల్లో జనసేన కన్నా, టీడీపీ నాయకుల మాటే శాసనం అన్నట్లు బేరసారాలు సాగుతున్నాయి. తాము చెప్పిన వారికే ఉద్యోగాలు కేటాయించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

పారదర్శకంగా ఇంటర్వ్యూలు

అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీపై ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పద్మసునందను వివరణ కోరగా ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. ఎక్కడా పైరవీలకు తావు లేకుండా ఇంటర్వ్యూలు చేపట్టినట్లు వివరించారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా అర్హులైన వారికి తప్పకుండా ఉద్యోగం అందేలా చూస్తున్నామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

నగరి: నియోజకవర్గ స్థాయిలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు ఆర్డీవో వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. నగరి మండలం సత్రవాడ-1లో ఒక వర్కర్ పోస్టుకు, నింద్ర మండలం శ్రీరామాపురం ఎస్టీకాలనీలో మినీ వర్కర్ పోస్టుకు, కార్వేటినగరం ప్రాజెక్టు పరిధి పద్మసరస్సు, జగన్నాథపురంలలో హెల్పర్ పోస్టులకు, జీడీనెల్లూరు ప్రాజెక్టు పరిధిలోని పాలసముద్రం మండలం బాలకృష్ణాపురంలో హెల్పర్ పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 5 పోస్టులకు గాను 10 మంది హాజరయ్యారు. నగరి ఆర్డీవో వెంకటరెడ్డి సమక్షంలో నగరి, కార్వేటినగరం, జీడీ నెల్లూరు సీడీపీవోలు కృష్ణవేణి, పద్మసునంద, వినీత ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆఫీసు సిబ్బంది కరుణాకర్‌రెడ్డి, మీనమ్మ, సుజాత, సుకన్య, శ్రీహరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఓం శక్తి ఆలయ ప్రారంభోత్సవం


ఓం శక్తి ఆలయ ప్రారంభోత్సవంలో భక్తులు

గంగాధరనెల్లూరు: మండలంలోని పెడకంటిపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో మేలుమరువత్తూరు ఓం శక్తి ఆలయాన్ని ప్రారంభించారు. జిల్లా ఓం శక్తి భక్తుల సంఘం అధ్యక్షులు సరిత శంకరబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెడకంటిపల్లి గ్రామంలోని గ్రామస్తులు ఓం శక్తి భక్తులు విశేష ఫల పుష్పాది హారతి తట్ట వరుసలతో ఊరేగింపుగా వచ్చి, ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కలశస్థాపన అభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందించారు. కమిటీ సభ్యులు ఆరుముగం రెడ్డి, గిరిజ, వినాయక, పెడకంటిపల్లి గ్రామస్తులు విజయకుమారి, పుష్పమ్మ, జయరామిరెడ్డి, ఆర్టీసీ చంద్రన్, అల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నమోదు చేయాలి


అవగాహన కల్పిస్తున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: మండలంలోని వీఓఏలు తమ రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్‌పీ, సీసీఎఫ్, స్త్రీనిధి రికవరీ, ఆరోగ్య పోషణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా గ్రూపులకు, సిబ్బందికి రికార్డులు రాసే విధానం, స్త్రీనిధి రికవరీపై వివరించారు. పెరటి కోళ్లు, పెరటి తోటలు పెంచే అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాధం, సంఘమిత్ర మురగయ్య, మంజుల, బాలయ్య, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీలోనే...


పద్మనాభరెడ్డి

వెదురుకుప్పం: తన ఊపిరి ఉన్నంత వరకూ వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి స్పష్టం చేశారు. తాను జనసేన పార్టీలో చేరుతానని వస్తున్న వదంతులను శుక్రవారం వెదురుకుప్పంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఖండించారు. ఆయన మాట్లాడుతూ తనపై కొన్ని సామాజిక మాధ్యమాల్లో వేరే పార్టీలో చేరుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నట్లు మండిపడ్డారు. పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఆవిర్భవించిన పార్టీని కాదని ఇతర పార్టీల్లో చేరతున్న ప్రచారాన్ని కొట్టిపారేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసినట్లు గుర్తు చేశారు. అసత్య ప్రచారాలను మానుకోవాలన్నారు.

జాబ్ మేళాలో 22 మంది ఎంపిక


ఎంపికైన అభ్యర్థులతో అధికారుల బృందం

పుత్తూరు: ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడెప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో 22 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.కోటేశ్వరయ్య తెలిపారు. జాబ్‌మేళాలో క్రెడిట్ ఆక్సెస్ గ్రామీన్ లిమిటెడ్, టీవీఎస్ ఇండియా, బీజెడ్ ఫిన్‌సెర్వ్ గ్రూప్ ఆఫ్ బ్యాంక్ జోన్, అపోలో ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. మొత్తం 56 మంది మేళాలో పాల్గొనగా 22 మంది ఎంపికై నట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చైతన్య, సీడెప్ ఆఫీసర్ లోకేష్, నరసింహులు, కళాశాల స్కిల్ హబ్ కోఆర్డినేటర్స్ రసూల్, సిసింద్రి, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సహకారంతో ఉన్నత లక్ష్యాలు


ఖాతాదారుల సమక్షంలో వేడుకలు

నగరి: ఖాతాదారుల సహకారంతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యమని కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ కె.నాగభూషణం అన్నారు. బ్యాంకు రూ.150 కోట్ల బిజినెస్‌ను సాధించడంపై బ్యాంకులో ఖాతాదారులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. సహకారాన్ని ఇలాగే కొనసాగించాలని, బ్యాంకు తరపున అంతే సహకారాన్ని తాము కూడా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ జె.నరేంద్ర, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గృహ లబ్ధిదారుల సమావేశం

పుత్తూరు: మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ గృహ లబ్ధిదారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మంజునాథగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమం ద్వారా ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ పనులు పూర్తి చేయడంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. గృహ నిర్మాణ సామగ్రి అందజేస్తామని వెల్లడించారు. సమావేశానికి లబ్ధిదారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

నగరి: పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజ్యలక్ష్మి మెడికల్ కళాశాల, హాస్పిటల్ వారు, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్తంగా ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నిజాముద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తపోటు, షుగర్ వ్యాధి పరిశోధన, చర్మ సంబంధిత వ్యాధులు, ఎముకల సంబంధిత వ్యాధులు, మహిళలకు చికిత్స, కంటి చికిత్స, చెవి, ముక్కు, గొంతు సంబంధిత చికిత్సలు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 63641 09600, 93615 15443 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం: మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీఓ విద్యావతి, ఏఎస్ఓ ఆనందమోహన్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ విద్యావతి మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పనులు సర్వే చేసి త్వరగా అందించాలన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేంద్రప్రసాద్, మండల విస్తరణాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈగా వరదరాజులు


వరదరాజులు

గంగాధరనెల్లూరు: మండల విద్యుత్ శాఖ ఏఈగా వరదరాజులు శుక్రవారం సబ్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. గంగాధరనెల్లూరు ఏఈగా విధులు నిర్వహిస్తున్న రాజా చిత్తూరుకి బదిలీ కావడంతో పాలసముద్రం ఏఈగా ఉన్న వరదరాజులు బదిలీపై జీడీనెల్లూరుకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, మెరుగైన విద్యుత్ అందించడానికి సిబ్బంది సహకారం తీసుకుంటానన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి భవనం



చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి భవనం సిద్ధమవుతోంది. తాత్కాలికంగా కార్యాలయ నిర్వహణకు నగరంలోని పాత ఆర్‌డీఓ కార్యాలయం భవనాన్ని ఎంపిక చేశారు. ఈ మేరకు అనుమతులు రావడంతో భవనానికి రంగులు వేస్తున్నారు. అక్టోబర్ 3వ తేదీన ప్రారంభోత్సవానికి ముహుర్తం ఖరారు చేసినట్లు తెలిసింది.

స్వచ్ఛతా సేవకు కట్టుబడి ఉండాలి


పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛతాహి సేవా


పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు


చర్చి ఆవరణను శుభ్రపరుస్తున్న పారిశుధ్య కార్మికులు

కార్వేటినగరం: స్వచ్ఛతా సేవకు విద్యార్థులు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ విజయలురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పరిసరాల పరిశుభ్రతా కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఎస్ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. పరిసరాల పరిశుభ్రతకు విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ క్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణంలో పిచ్చిమొక్కలను తొలగించి పారిశుధ్యాన్ని మెరుగు పరిచారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మునికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వెదురుకుప్పం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఈఓపీఆర్డీ పురుషోత్తం అన్నారు. శుక్రవారం మండలంలోని పచ్చికాపల్లంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్త కుప్పలను తొలగించారు. మట్టి తోలి చదును చేశారు. డీడీఓ మోహన్‌కుమార్, సర్పంచ్ పాల్గొన్నారు.

చర్చి ప్రాంగణంలో స్వచ్ఛతాహి సేవ

నగరి: స్వచ్ఛభారత్ దివస్ పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 గాంధీ జయంతి వేడుకల వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛతాహి సేవలో భాగంగా సీఎస్ఐ పాస్టర్ మెమోరియల్ చర్చి ఆవరణను శుభ్రపరిచారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నాగలాపురం రోడ్డులోని చర్చి ఆవరణకు వెళ్లిన పారిశుధ్య కార్మికులు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. చర్చి ప్రహరీ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించారు. కాలువల్లో పూడిక తీశారు. చర్చి ప్రాంగణంలోని చెత్తకుప్పలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్ డీఎస్ రాజా ప్రభు, నిర్వాహకులు జ్యోత్స్న, దివ్య కుమారి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

భూమనకు ఘన సన్మానం


కరుణాకరడ్డిని సత్కరిస్తున్న హేమసుందర్‌రెడ్డి

వెదురుకుప్పం: టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని మండలంలోని గంటావారి పల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి కలిశారు. శుక్రవారం తిరుపతిలో ఉన్న కరుణాకరరెడ్డిని ఘనంగా సత్కరించారు. ముమ్ముందు మంచి రోజులు వస్తాయని ప్రతి ఒక్కరూ ధైర్యంగా కూటమి ప్రభుత్వంపై పోరాటాలు చేయాలని కరుణాకరరెడ్డి సూచించినట్లు తెలిపారు. ఆయన వెంట యువత అధ్యక్షుడు గణపతిరెడ్డి ఉన్నారు.

వ్యాస రచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పుత్తూరు: స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047లో భాగంగా శుక్రవారం స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో మండల స్థాయి వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో బాలికల పాఠశాలకు చెందిన జి.దేవిశ్రీ ప్రథమ స్థానం కై వసం చేసుకోగా, వక్తృత్వ పోటీల్లో రాచపాళెం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన బి.చరిష్మ ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం భువనేశ్వరి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాలను ఎంఈఓ తిరుమలరాజు పర్యవేక్షించారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, ఆపరేషన్లకు ఎంపికైన మహిళలు

పుత్తూరు: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాస్ సంస్థ పలు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని శంకర నేత్రాలయ అధికారి వెంకటముని తెలిపారు. శుక్రవారం రాష్ట్రీయ సేవా సమితి (రాస్), చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ హాస్పిటల్ వారు సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటముని మాట్లాడుతూ మహిళా పొదుపు సంఘ సభ్యుల సౌకర్యార్థం రాస్ సంస్థ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. ఉచితంగా వృత్తి శిక్షణా తరగతులు నిర్వహిస్తూ, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎంతగానో దోహదపడుతున్నారని చెప్పారు. వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 16 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి అక్టోబర్ 2న చెన్నైలోని శంకర నేత్రాలయ హాస్పిటల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర నేత్రాలయ వైద్యులు అరవింద్, వెంకటముని, రాస్ సిబ్బంది ప్రకాష్, ఏకాంబరం, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగు పడాలి


మాట్లాడుతున్న భీమ మోహన్‌రావు

వెదురుకుప్పం: ఆర్థిక రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినప్పుడే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద అన్నారు. శుక్రవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర-2047 అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యం, విద్యా రంగాల్లో మార్పులు, పారిశ్రామిక రంగంలో పురోగతి, ఐటీ రంగంలో అగ్రగామిగా నిలవాలని కోరారు. అనంతరం ఐక్యూఏసీ కోఆర్డినేటర్ భీమమోహన్‌రావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. చివరిగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టి, విజేతలకు బహుమతులు అందజేశారు.

భూ రికార్డుల పరిశీలన


మాట్లాడుతున్న ఆర్‌డీఓ చిన్నయ్య

తవణంపల్లె : తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డులను ఆర్‌డీఓ చిన్నయ్య శుక్రవారం పరిశీలించారు. భూముల రికార్డులను పరిశీలించారు. మండలంలో 72 ఎకరాల అసైన్డ్‌మెంట్ భూములను ఫ్రీ హోల్డ్ సంబంధించిన ఫైలును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే మత్యం, చిగరాకులపల్లె పోలింగ్ బూత్‌ల విభజనకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. తహసీల్దార్ సుధాకర్, భూ రీసర్వే డీటీ వెంకటరమణ పాల్గొన్నారు.